క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో రద్దీ సాధారణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉదయం లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులతో పాటు అయ్యప్పలు, స్వాములు, భవానీలు తరలివచ్చారు. శబరిమలై యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారు కొందరయితే, ఇరుముడిని ధరించి శబరిమలైకు వెళ్తూ అమ్మవారిని దర్శించుకునేందుకు మరి కొంత మంది స్వాములు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ, పల్లకీ సేవలు నిర్వహించగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురేంద్ర



లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన వారు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి, తప్పక పాటించాలని డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. పురేంద్ర అన్నారు. బెంజిసర్కిల్‌లోని ట్రెండ్‌సెట్‌మాల్‌లో రెడ్‌ఎఫ్‌ఎం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆటో ఎక్స్‌పోను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇలాంటి ఎక్స్‌పోలు ఉపయోగపడతాయన్నారు . ఈ ఎక్స్‌పోలో బైక్స్, స్కూటర్స్, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్‌హెడ్ ఆదిల్‌బాషా, క్రాంతికుమార్, సుధాకర్, మాల్ ఇన్‌చార్జి జగన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ అన్నారు. ఆ కళాశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకుని నేషనల్ మేథమెటిక్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాథ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, గణిత నమూనాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ అనురాధ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రియేటివిటీ, లాజికల్‌థింకింగ్, ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు పాజిటివ్ ఆటిట్యూడ్‌ని కలిగి ఉండాలని, ఎడ్యుకేషన్ అంటే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమన్నారు. కార్యక్రమంలో మేథమేటిక్స్ హెచ్‌ఓడీ వి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఖ్యాతిని పెంచాలి



విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ పోటీల్లో రాణించి విజయవాడ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని రోలర్ స్కేటింగ్ జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బచ్చు మాధవికృష్ణ కోరారు. చెన్నై, చండీగఢ్‌లలో ఇటీవల జరిగిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులు వరుణ్‌కృష్ణ, మదన సుచిత్ర, పోతల విజయ్‌డానియేల్, బుగతా జతీన్, కోవూరి శాన్విరఫియా, సీ.హెచ్.అభిరామ్, జి.ప్రణవ్‌రెడ్డి, పి.హరిచరణ్‌లను బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలోని బెజవాడ రోలర్ స్పోర్ట్స్ కార్యాలయంలో ఆమె శుక్రవారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఎస్ఆర్ఆర్‌లో జాతీయ గణిత దినోత్సవ సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట రమణమూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు గణితంపై భయం వీడి ఆసక్తి పెంచుకోవాలని గణితంతో మేధస్సు పెరుగుతుందని లయోలా కళాశాల రిటైర్డ్ గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట రమణమూర్తి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన గణితం గురించి వివరించారు. అలాగే శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ పీ శైలజ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో ..

దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల హెచ్‌ఎం ఎం.సూర్యప్రభ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరెడ్డి నిత్య జీవితంలో గణితం ప్రాముఖ్యతను వివరించారు. రామానుజన్ స్ఫూర్తితో గణితంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం గణిత టాలెంట్ టెస్టు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, శ్రీనివాసరావు, గోపాలరావు, సవితశ్రీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గణిత పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



విద్యార్థుల గణిత ప్రదర్శనలు

వాణీ స్కూల్‌లో..

మాచవరం వాణీ స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గణిత మేధావి రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న గణిత ప్రదర్శనలు..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల గణిత సంబంధ నమూనాలు ఆకట్టుకున్నాయి. గణిత శాస్త్రంలోని సిద్ధాంతాలు, సూత్రాలు, ఫజిల్స్, గణిత ప్రక్రియలు, గణిత సంబంధ సరదా ఆటలు అయిన ఇంద్రజాలం వెనుక ఉన్న గణిత రహస్యాలు, ముఖ్యంగా శ్రీనివాస రామానుజన్ మ్యాజిక్ స్క్వేర్ ఆధారంగా వివిధ రకాల అద్భుతమైన స్క్వేర్స్‌ను ప్రదర్శించారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ట

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్చారణలతో శుక్రవారం వైభవంగా జరిగింది. దాత ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, వెంకటరమణ దంపతుల చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేసి నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండే విధంగా నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసిన దాత కొండలరావును అభినందించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు 15 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులు పర్యవేక్షించారు.



ధ్వజస్తంభం ప్రతిష్ట చేస్తున్న దృశ్యం

న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరణ

గుణదల(విజయవాడ తూర్పు): నూతన సంవత్సర వేడుకల్లో యువతను ఉర్రూతలూగించే దిశగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు ఐకా ఈవెంట్ ఆర్గనైజేషన్ సంస్థ సీఈఓ డి.జయదుర్గ అన్నారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్‌లో ఐకా న్యూ ఇయర్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జయదుర్గ మాట్లాడుతూ, ఈ నెల 31వ తేదీన మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో అట్టహాసంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో నాటు నాటు అంటూ పాడిన గాయకుడు రాహుల్ సిప్లి గంజ్ ఈ వేడుకలకు హాజరు కానున్నారని తెలిపారు. తన బృందంతో పాప్ సాంగ్స్ పాడి యువతను ఉర్రూతలూగిస్తారని పేర్కొన్నారు. అనంతరం న్యూ ఇయర్ ఈవెంట్ పోస్టర్‌ను సింగర్ రాహుల్ సిప్లి గంజ్‌తో కలిసి ఆవిష్కరించారు.



పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న రాహుల్ సిప్లి గంజ్

బీసీ జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు అనుగుణంగా వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని పలువురు బీసీ నేతలు కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వతంత్ర పోరాట రథయాత్ర పేరుతో శుక్రవారం సాయంత్రం చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి గుడిలో అమ్మవారి దర్శనం అనంతరం బీసీల రాజ్యాధికార రథయాత్రను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో వెంగళరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. వెంగళరావు మాట్లాడుతూ బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రథయాత్ర ముగింపు కార్యక్రమం తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో జరుగుతుందన్నారు. సంఘం ఏపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

రామవరప్పాడు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన 'మాదక ద్రవ్యాలు– సోషల్ మీడియా దుర్వినియోగంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. ప్రస్తుతం అవగాహన లోపంతో విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు బానిసగా మారుస్తుందన్నారు. ఈ వ్యవసనాల ప్రభావంతో తమ వ్యక్తిత్వం కోల్పోవడంతో పాటు సమాజంలో చులకనకు గురవుతారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని డి ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.విజయరాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు రజిత, ముబీనా బేగం, లలిత, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోళ్లమూడి శేఖర్ బాబు

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తమ్ముడిపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట రామాలయం ప్రాంతానికి చెందిన సింగపల్లి కిరణ్‌కుమారి, రాంప్రసాద్ భార్యభర్తలు. కిరణ్‌కుమారి నగర పాలక సంస్థ మలేరియా విభాగంలో డ్వాక్రా కార్మికురాలు. కొద్ది కాలం కిందట కిరణ్‌కుమారిపై మరిది సింగపల్లి జగ పూర్ణ దుర్గారావు అత్యాచారం యత్నం చేయబోగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని రాంప్రసాద్ తరుచూ కిరణ్‌కుమారిని వేధింపులకు గురి చేయసాగాడు. భర్త వేధింపులు భరించలేక కిరణ్‌కుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సబ్‌జైల్ ఏరియా, రైల్వేస్టేషన్ రోడ్, వెహికల్‌డిపో రోడ్, రైల్వేకాలనీ, రైల్వేస్టేషన్, పూర్ణనందం పేట, ఆలపాటి రామారావు వీధి, సాంబమూర్తి రోడ్, కుటుంబరావు వీధి, నాగభూషణం వీధి, అచ్యుతరామయ్య వీధి, తిరుమలరావు వీధి, నంబూరి గోపాలరావు వీధి, పాత గవర్నమెంట్ హాస్పిటల్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, హెటీసర్వీసెస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా మాచవరం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుణదల పడవలరేవు ఏరియా, పిచ్చమ్మతల్లి గుడి, మాచవరం రెవెన్యూకాలనీలోని అన్ని లైన్లు, మాచవరం గ్రంథాలయం ఏరియా, మాచవరండౌన్ కొండప్రాంతం, ఏలూరురోడ్డు, కార్మికనగర్ కొండ ప్రాంతం, యారంవారివీధి, యలిశలవారి వీధి, వాటర్‌ట్యాంక్ రోడ్డు, ప్రతిభానికేతన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

29న దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి సమావేశం ఈ నెల 29వ తేదీన జరగనుంది. బ్రాహ్మణ వీధిలోని పరిపాలనా భవనంలో నిర్వహించే ఈ సమావేశంలో రానున్న భవానీ దీక్షల ఏర్పాట్లు, సాధారణ పరిపాలనా అంశాలు చర్చకు రానున్నాయి. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈవో కేఎస్ రామారావులతో పాటు ఆలయ ముఖ్య విభాగాల అధికారులు హాజరు కానున్నారు.

వ్యక్తి కనిపించడంలేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని నున్న పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, జంగారెడ్డిగూడెంకు చెందిన పాతన కుమారస్వామి(31) భార్య అశ్వితతో నున్న గ్రామంలో ఉంటున్నాడు. బెంజి కంపెనీ వద్ద సీక్వెల్ ఆఫీసు నందు పని చేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన నున్న గ్రామం నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని భార్య అశ్విత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుణదల పీఎస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లోని గుణదల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ కృష్ణమోహన్ స్టేషన్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రార్థనలు చేసి కేక్, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సందేశంను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సత్య శ్రీనివాస్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నాటికి కృష్ణా జలాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే వేసవి నాటికి 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి అవసరాల దృష్ట్యా కృష్ణా జలాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో రూ. 3.30 కోట్లతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆకాంక్షల మేరకు ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని చెప్పారు. అయితే డివిజన్‌లో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవడంతో స్థలాన్ని సేకరించి నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. రూ. 3.29 కోట్ల వ్యయంతో గంగిరెద్దుల దిబ్బ నుంచి 400 ఎంఎం పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి కోసం కృష్ణా జలాలు అందించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు వివరించారు. అలాగే డివిజన్‌లో ప్రస్తుతం 22 తారు రోడ్లు వేస్తున్నామని త్వరలోనే మెయిన్ రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమౌళి, దుర్గారావు, పవన్, అధికారులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ వద్ద ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ జానారెడ్డి

నాటకరంగం ద్వారా సృజనాత్మకత వెలికితీత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ పెంపొందించేందుకు నాటక రంగం ఎంతో దోహదపడుతుందని శ్రీరామ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బోని సురేష్‌కుమార్ అన్నారు. తమ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బాల కార్మిక వ్యవస్థ ఇతివృత్తంగా సాగే నాటకం నంది నాటకోత్సవాలు–2022కు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే నంది నాటకోత్సవాల్లో సింగ్‌నగర్‌లోని శ్రీరామ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాటకం మేటిగా నిలవడం సంతోషంగా ఉందని తెలిపారు. డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన ఈ నాటకానికి పి.సాయిశంకర్ దర్శకత్వం వహించారని ఆయన చెప్పారు. ఈ నెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఫైనల్ ప్రదర్శనలో కూడా ఈ నాటకం మంచి విజయం సాధించి నగరానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసురావాలని ఆకాంక్షించారు. నాటకంలో ఉన్న విద్యార్థులను, దర్శక, రచయితలను ఆయన అభినందించారు.



నాటకంలో పాల్గొన్న చిన్నారులు, దర్శక, రచయితలతో సురేష్‌కుమార్, స్కూల్ యాజమాన్యం

కోలాటంతో మానసిక ప్రశాంతత

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కోలాటం వల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి అన్నారు. స్థానిక దావు బుచ్చయ్యకాలనీ 9వ లైనులో మురళీకృష్ణ కోలాట భక్తబృందం ఆధ్వర్యాన కోలాటం ప్రదర్శన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంత మంది మహిళలు, చిన్నారులు 40 రోజులుగా కోలాటం నేర్చుకుని ప్రదర్శన చేయడం తమ ప్రాంతానికే గర్వకారణం అన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్రదర్శనలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం 40 రోజులుగా శిక్షణ ఇచ్చిన గురువు నరసింహారావును సత్కరించారు. చిన్నారులు, మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

27న డివిజనల్ పంచాయతీల సమావేశం

విజయవాడరూరల్: విజయవాడలోని డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన డివిజనల్ పంచాయతీల సమావేశం జరుగనున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రగాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను వసూళ్లు, ఎలక్ట్రిసిటీ కనెక్షన్ల మానిటరింగ్, 2021 నుంచి గ్రంథాలయాల పన్ను వసూళ్లు, స్వమిత్వ సర్వే ప్రగతి నివేదిక, గ్రామ స్వరాజ్–పిఎఫ్‌ఎంఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల చెల్లింపుల వివరాలు వంటి అంశాలపై సమీక్ష ఉంటుందని డీఎల్‌పీఓ పేర్కొన్నారు. కావున ఈ సమావేశానికి విజయవాడ డివిజన్‌లోని ఈఓపీఆర్‌డీలు, గ్రేడ్–వన్, టూ, త్రీ, ఫోర్ కార్యదర్శులు పైన పేర్కొన్న పూర్తి వివరాలతో విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

గన్నవరం చేరుకున్న తేరు ఊరేగింపు ఉత్సవం

గన్నవరం: గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తేరు ఊరేగింపు శుక్రవారం గన్నవరం చేరుకుంది. స్థానిక కొత్తపేట వద్ద గుణదల మాత తేరు స్వరూపానికి ఆర్‌సీఎం విచారణకర్త ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం మేళతాళాలు మధ్య జాతీయ రహదారిపై ఊరేగింపు కొనసాగింది. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సీఐ పి. కనకరావు గుణదలమాత తేరుకు పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక బాలయేసు దేవాలయానికి తేరు ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా ఫాదర్ పసల థామస్ ఆధ్వర్యంలో జపమాల, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గన్నవరం విచారణ పరిధిలోని నాగవరప్పాడు, దావాజిగూడెం, అల్లాపురం, వీఎన్ పురం కాలనీలో వందలాది మంది భక్తులతో తేరు ఊరేగింపు జరిగింది. సాయంత్రం తిరిగి బాలఏసు దేవాలయానికి తేరు చేరుకోగా దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన క్రిస్మస్ గీతాలు, కేరల్స్ బాలబాలికలతో నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ప్యారిస్ కౌన్సిల్ అధ్యక్షుడు నీలం జాకబ్, సభ్యులు, మరియదళం, విన్సెంట్ ది పాల్ సొసైటీ సభ్యులు, సెయింట్ పీటర్ క్లావర్ సిస్టర్స్, ఉపదేశులు పాల్గొన్నారు.



మేరీమాత తేరుకు స్వాగతం పలుకుతున్న ఫాదర్ థామస్, విశ్వాసులు

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

దావాజిగూడెం(గన్నవరం): స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చనలు చేశారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామివార్లకు సుప్రభాతసేవ, విశేష అర్చనలు, తిరుప్పావై ప్రబంధ పారాయణం జరిగింది. అనంతరం శ్రీగోదాదేవి సన్నిధిలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు.



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com